

నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు

● స్పీకర్ అప్పావు



ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఈ నెల 17వ తేదీ వరకు జరుగుతాయి. మరో ఏడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాష్ట్ర ఆర్థిక అనుబంధ పద్దులు ప్రవేశపెట్టి ఆమోదం పొందేందుకు అనుగుణంగా నిర్వహించనున్న అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలన్న దానిపై సభావ్యవహారాల కమిటీ సమావేశం సోమవారం ఉదయం సచివాలయ ప్రాంగణంలోని స్పీకర్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం స్పీకర్ అప్పావు మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను ఈ నెల 17వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించేలా సభావ్యవహారాల కమిటీ నిర్ణయించిందని తెలిపారు. తొలిరోజు కరూర్ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి, ఇటీవల మృతిచెందిన నాగాలాండ్ మాజీ గవర్నర్ ఇల గణేశన్, సీపీఐ సీనియర్ నేత సుధాకర్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి బీలా వెంకటేశన్, కోవై జిల్లా వాల్పారై ఎమ్మెల్యే అమూల్ కందస్వామి మృతికి సంతాపం తెలిపి సమావేశాన్ని వాయిదా వేస్తామన్నారు. 15, 16, 17వ తేదీ సమావేశాల్లో 2025-2026వ సంవత్సరానికి అదనపు ఖర్చుల బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ముందుగా ప్రశ్నోత్తరాలకు అధికసమయాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రశ్నోత్తరాలు ముగిసిన వెంటనే అదనపు ఖర్చుల బిల్లులపై నిర్వహించనున్న చర్చలో అఖిలపక్షాల సభ్యులు పాల్గొని అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖ మంత్రులు సమాధానాలు చెబుతారని స్పీకర్ అప్పావు తెలిపారు.

ప్రారంభోత్సవాలు...శంకుస్థాపనలు

● సచివాలయంలో పలు శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ● హాజరైన సీఎం స్టాలిన్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫుడ్ పార్కులు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు జిల్లాల్లో పూర్తయిన పథకాల ప్రారంభోత్సవాలు, కొత్త పథకాల శంకుస్థాపన కార్యక్రమం సోమవారం చెన్నై సచివాలయంలో జరిగింది. ముందుగా పరిశ్రమలు పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రూ.190 కోట్లతో కొత్తగా నిర్మించిన రెండు మెగా ఫుడ్ పార్క్‌లను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. విల్లుపురం జిల్లా దిండివనం వద్ద రూ.120 కోట్లతో నిర్మించిన మెగా ఫుడ్ పార్క్‌కు, తేనిజిల్లాలోని తేని వద్ద రూ.70 కోట్లతో నిర్మించిన మెగా ఫుడ్‌పార్క్‌కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. ఇదే విధంగా తేర్వాయ్‌కండిగ, వల్లమ్ వడకాల్, సిరుచేరి, గుమ్మిడిపూండి, కడలూరు, బర్గూరు, పెరుందురై, తూత్తుకుడి, నిలకోట, రాణిపేట, పుదుకోట, మానామదురై, ఒరగడం, పిళ్లైపాక్కం, హోసూరు, గంగైకొండాన్ పారిశ్రామిక వాడలల్లో పనిచేసే ఉద్యోగుల శిశువుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 16 శిశు సంరక్షణ కేంద్రాలను కూడా ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సెంథిల్ రాజ్, సీఈఓ ఎ. కేథరిన్ శరణ్యా తదితరులు పాల్గొన్నారు.

రూ.55.68 కోట్లతో లా కాలేజీల్లో కొత్త భవనాలు....

రాష్ట్ర న్యాయశాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మదురై ప్రభుత్వ న్యాయకళాశాలలో విద్యా సంబంధిత, పరిపాలక మండలి భవనాలు, వేలూరు ప్రభుత్వ న్యాయ కళాశాలలో గ్రంథాలయ భవనాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్, న్యాయశాఖ కార్యదర్శి సి.జార్జ్ అలెగ్జాండర్, న్యాయవిద్యా సంచాలకులు ప్రొఫెసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ పథకాల ప్రారంభోత్సవం...

సచివాలయంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో రూ.48.81 కోట్లతో వివిధ ఆలయాల్లో చేపట్టిన పథకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా ఆ శాఖలో రూ.43.20 కోట్లతో చేపట్టనున్న ఐదు పథకాలకు శంకుస్థాపన చేశారు. చివరగా టీఎన్‌పీఎస్సీ ద్వారా దేవాదాయ శాఖలో వివిధ పోస్టులకు ఎంపికైన 83 మందికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్ బాబు, పర్యాటక, సంస్కృతి దేవాదాయ శాఖల అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ డాక్టర్ సి.పళని తదితరులు పాల్గొన్నారు.

రూ.7.465 కోట్లతో పర్యాటక శాఖ పథకాలు...

సచివాలయంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో రూ.7.46 కోట్లతో పూర్తయిన పథకాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అదే విధంగా రూ.16.30 కోట్లతో చేపట్టనున్న 5 కొత్త పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆర్.రాజేంద్రన్, పర్యాటక శాఖ సంచాలకులు డి. క్రీస్తురాజ్, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ఎస్. కవిత తదితరులు పాల్గొన్నారు.

పుదువైలో రూ.436 కోట్లతో ఫ్లై ఓవర్

● శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

పుదుచ్చేరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ఈస్ట్‌కోస్ట్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా రూ.436 కోట్లతో నాలుగు కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఫ్లైఓవర్‌కు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ ఫ్లైఓవర్ ఇందిరాగాంధీ స్క్వేయర్ నుంచి రాజీవ్‌గాంధీ స్క్వేయర్ వరకు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఇదే విధంగా రాజీవ్‌గాంధీ స్క్వేయర్ నుండి కనకశెట్టి కుళం వరకు ఉన్న 13.63 కి.మీ.ల మేర రూ.25.04 కోట్లతో రోడ్డు పునర్నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్ నమూనా తిలకిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, పుదుచ్చేరి సీఎం రంగస్వామి తదితరులు

దక్షిణ రైల్వే ఏజీఎంగా విపిన్‌కుమార్



బాధ్యతలు స్వీకరించిన విపిన్ కుమార్

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ (ఏజీఎం)గా విపిన్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో దక్షిణ రైల్వే ఏజీఎంగా పనిచేసిన కౌశల్ కిషోర్ ఆగస్టులో పదవీ విరమణ చేసారు. ఏజీఎం విపిన్ కుమార్, అలహాబాద్‌లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పట్టభద్రుడై, ఢిల్లీ ఐఐటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 1988లో ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఈ)లో చేరిన ఆయన, తన సుదీర్ఘమైన కెరీర్‌లో, సౌత్ సెంట్రల్ రైల్వే, నార్తర్న్ రైల్వే, సౌత్ వెస్ట్రన్ రైల్వే, సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్టర్న్ రైల్వే, నార్త్ సెంట్రల్ రైల్వేలో వివిధ హోదాల్లో పనిచేశారు. రైల్వేలు, మెట్రోలు, హైవేలు, సొరంగాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లకు విపిన్ కుమార్ నాయకత్వం వహించారు. తూర్పు రైల్వేలో సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, బెంగుళూరులోని రైల్ వీల్ ఫ్యాక్టరీ ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం, నార్త్ సెంట్రల్ రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కన్‌స్ట్రక్షన్)గా వ్యవహరిస్తున్న విపిన్ కుమార్, దక్షిణ రైల్వే కొత్త ఏజీఎంగా బాధ్యతలు చేపట్టారు. నూతన ఏజీఎంకు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

కోవై ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

● లారీని కారు ఢీకొని ముగ్గురి మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ, నుజ్జునుజ్జయిన కారు

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన జీడీ నాయుడు ఫ్లైవోవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి సహా ముగ్గురు దుర్మరణం చెందారు. ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో కోవై ఉప్పిలిపాళయం ప్రాంతం నుండి గోల్డ్‌విన్స్ ప్రాంతం వైపు ఇద్దరు యువకులు, ఓ యువతి ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు లారీ కిందికు దూసుకెళ్లి నుజునుజ్జయ్యింది. సమాచారం అందిన వెంటనే కోయంబత్తూరు ఈస్ట్ పోలీసులు, పీలమేడు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కారుశిథిలాల నుంచి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ముగ్గురినికి వెలికితీశారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆ ముగ్గురు మృతి చెందారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మృతిచెందిన యువకులను ఒండిపుదూరుకు చెందిన హరీష్ (20), షేక్ హుసేన్ (20)గా గుర్తించారు. వారిద్దరూ బట్టల దుకాణంలో పనిచేస్తున్నారు. వారితోపాటు కారులో ఉన్న యువతి వివరాల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇంటిపట్టాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదురవాయిల్ నవరత్నమల్ జైన్ ప్రాంగణంలో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఉదయనిధి 1,600 మందికి ఇంటిపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, సొంతిల్లు నిర్మించుకోలేని సామాన్యప్రజల కల నెరవేరేలా సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం కూడు, గూడు, ఆశ్రయం అనే లక్ష్యంతో గత నాలుగున్నరేళ్లుగా పనిచేస్తోందన్నారు. పట్టాలేక పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు గురికాకూడదన్న ఉద్దేశంతోనే నివసిస్తున్న ప్రాంతంలో ఉన్నవారికి పట్టా అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేవలం చెన్నై జిల్లాలో మాత్రమే గత ఏడాది కాలంలో సుమారు లక్షా 40వేల మంది లబ్దిదారులకు ఇంటిపట్టాలు పంపిణీ చేశామని చెప్పడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడ మాత్రమే కాకుండా మిగతా జిల్లాల్లో కూడా పోరంబోకు స్థలాల్లో నివసిస్తున్న ప్రజలకు వెంటనే పట్టా పంపిణీ చేయాల్సిందిగా ఆయా కలెక్టర్లకు సీఎం ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. దేశంలోనే తమిళనాడు 11.19 శాతం అభివృద్ధితో ప్రథమస్థానంలో ఉందని, రాష్ట్రప్రజలు అందిస్తున్న సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తమిళనాడు హౌసింగ్ బోర్డ్, నగరాభివృద్ధిశాఖ మంత్రి ముత్తుస్వామి, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యేలు కె.గణపతి, జోసఫ్ శ్యామూవేల్, ఎన్.ఎబీలన్, ఆర్. మూర్తి, ప్రభాకర్‌రాజా, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి పి.అముద తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్



గవర్నర్ ఆర్.ఎన్.రవి

అడయార్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి సోమవారం ఢిల్లీ వెళ్ళారు. ఇది ఆయన వ్యక్తిగత ప్రయాణమని, దీనికి ఎలాంటి ప్రాధాన్యత లేదని రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి. సోమవారం ఉదయం 8.05 గంటలకు ఎయిరిండియా విమానంలో ఆయన హస్తినకు బయలుదేరి వెళ్ళారు. ఆయన వెంట భద్రతాధికారి, వ్యక్తిగత కార్యదర్శి ఒక సహాయకుడు ఉన్నారు. గవర్నర్ ఢిల్లీ పర్యటనపై రాజ్ భవన్ వర్గాలు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువరించలేదు.

ప్రభుత్వ కళాశాలల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు

● ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్



ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో ప్రొఫెసర్ల కొరత లేకుండా, ఆయా పోస్టులను భర్తీ చేస్తున్నట్టు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ హామీ ఇచ్చారు. తంజావూరులో ఇటీవల నిర్వహించిన సీఎం ట్రోఫీ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలో గెలుపొందిన నామక్కల్ జిల్లా జట్టుకు సోమవారం ఉదయం జరిగిన అభినందన కార్యక్రమానికి మంత్రి చెళియన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతకు రూ.11.50లక్షలు, 2,3 స్థానాల్లో నిలిచిన తిరువారూర్, తెన్‌కాశి జిల్లాల జట్లకు రూ.9లక్షలు, రూ.4.5 లక్షల నగదు బహుమతి అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కొత్తగా 34 ప్రభుత్వ కళాశాలలను ప్రారంభించామని, 64 కళాశాలల్లో రెండు షిఫ్టుల విధానం కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీ అయిన ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసేలా చేపట్టిన తొలి విడత చర్యల కింద 2,700 మందిని కొత్తగా నియమించినట్లు తెలిపారు. గౌరవ లెక్చరర్ల ఎంపికకు సంబంధించి ప్రస్తుతం ఇంటర్వ్యూ జరుగుతోందని, మరో నెల రోజుల్లోపు 2,700 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లను నియమించేందుకు టీచర్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఆర్‌బీ) ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తంజావూరు ఎంపీ మురసొళి, ఎమ్మెల్యేలు దురైచంద్రశేఖరన్, నీలమేఘన్, అథ్లెటిక్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణస్వామి వాండయార్, జిల్లా విద్యాశాఖ అధికారి డేవిడ్ డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్లస్ టూ తరగతికే మార్కుల జాబితా

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26) నుంచి ప్లస్ వన్ తరగతి పబ్లిక్ పరీక్షలు రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షల రద్దుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ ప్రకారం, 2017-18 విద్యా సంవత్సరానికి ముందున్న విధానాన్నే కొనసాగించనున్నారు. ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు రద్దు కావడంతో, ఇక నుంచి కంబైన్డ్ మార్కుల సర్టిఫికెట్ బదులు ప్లస్ టూ పబ్లిక్ పరీక్షకు మాత్రమే మార్కుల సర్టిఫికెట్ అందజేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కరూర్ మృతుల కుటుంబాలను దత్తత తీసుకుంటాం

● టీవీకే నేత ఆదవ్ అర్జున్



చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచారపర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది కుటుంబాలను దత్తత తీసుకుంటామని ఆ పార్టీ ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునా తెలిపారు. సోమవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు టీవీకే శ్రేణులకు ఊరట కలిగించేలా ఉందన్నారు. కరూర్‌లో పోలీసులు నిర్దేశించిన స్థలంలోనే విజయ్ ప్రచార చేశారని, కరూర్ సరిహద్దులోనే పోలీసులు తమను స్వాగతించడం పలు అనుమానాలకు తావిచ్చేలా ఉందన్నారు. పోలీసులు నిర్దేశించిన మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 10 గంటల్లోగా విజయ్ ప్రచార ప్రాంతానికి వచ్చారని, ఆయన ఆలస్యంగా వచ్చారని చెప్పటం అసత్యమని ఆదవ్ అర్జునా పేర్కొన్నారు. తొక్కిసలాట జరిగిన వెంటనే తామంతా కరూర్ జిల్లా సరిహద్దులోనే నిలిచి ఉన్నామని, ఆ సమయంలో మళ్ళీ తొక్కిసలాట జరుగుతున్న ప్రాంతానికి వెళితే అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయని పోలీసు అధికారులు హెచ్చరించడం వల్లే అక్కడి నుండి బయలుదేరినట్లు తెలిపారు. కరూర్ దుర్ఘటన జరిగిన తర్వాత టీవీకే జిల్లా కార్యదర్శులను పోలీసులు తప్పుడు కేసుల్లో అరెస్టు చేయడం ఆనవాయితీగా మారిందన్నారు. కరూర్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది కుటుంబీకులకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, ఆ కుటుంబాలను దత్తత తీసుకునేందుకు విజయ్ సిద్ధంగా ఉన్నారని కూడా ఆయన చెప్పారు.

విజయ్ పార్టీతో పొత్తు !

● ఈపీఎస్ పరోక్ష వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తు కుదుర్చుకోనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పరోక్ష వ్యాఖ్యలు చేశారు. సేలంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొంతమంది పాత్రికేయులు టీవీకే అధ్యక్షుడు విజయ్, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ గురించి ప్రశ్నించారు. ఈపీఎస్ సమాధానం చెబుతూ, అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకోవాలంటూ ఆ పార్టీ ప్రధాన నాయకులు, జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు ఒత్తిడి చేస్తున్నారని, అంతేకాకుండా తాను పాల్గొంటున్న ప్రచార సభల్లో టీవీకే జెండాలతో ఆ పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు. టీవీకేతో పాటు మరికొన్ని పార్టీలతో పొత్తు కోసం చర్చించే అవకాశముందన్నారు. ఈ సారి తమ నేతృత్వంలో బలమైన కూటమి ఏర్పాటవుతుందన్నారు. తమ కూటమిలో ఉన్న పార్టీలు స్వేచ్ఛగా ఉంటాయని, అయితే డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, డీపీఐ, వామపక్షాలు అధికార పార్టీని విమర్శించకుండా బానిసలుగా ఉంటున్నాయని ఈపీఎస్ ఎద్దేవా చేశారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ఉదయం 9 నుంచి మధ్యాహ్నం గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

ఆవడి: కోవిల్ పాటగై, పార్క్ వీధి, అశోక్ నగర్, బైబిల్ కాలేజ్, క్రైస్ట్ కాలని, నాగమ్మై నగర్, ఎట్టిఅమ్మన్ నగర్, కృపా నగర్, తెండ్రల్ నగర్, బాలాజి నగర్, సీడీ రోడ్డు, టీవీ షోరూమ్, బీవెల్ హాస్పిటల్

తిరుముల్లైవాయల్: మోరై, వీరాపురం, కన్నియమ్మన్ నగర్, డీఎస్పీ క్యాంప్

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా నగర్, అన్నాసాలై, గిండి ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరాలు జరుగనున్నాయి. శిబిరాలు జరిగే ప్రాంతాల వివరాలను విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. అన్నాసాలై పరిధిలో చింతాద్రిపేట లాబాండ్ వీధిలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, అన్నా నగర్ పరిధిలో 11వ మెయిన్ రోడ్డు 5 వీధి హెచ్ బ్లాక్‌లో ఉన్న నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, గిండి పరిధిలో కేకే నగర్ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో శిబిరాలు జరుగనున్నాయి. విద్యుత్ బిల్లులు, తదితరాల సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

సైనిక పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న 33 సైనిక పాఠశాలల్లో 6,9 తరగతుల్లో అడ్మిషన్లకు ప్రతి ఏడాది జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) అర్హత పరీక్ష నిర్వహిస్తుంది. ఆ ప్రకారం, 2026-27 విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి జనవరిల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ttps://exams.nta.nic.in/sainik/schoolsociety/ అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుముగా ఎస్సీ, ఎస్టీ విభాగాలు రూ.700, ఇతరులు రూ.800 ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31వ తేదిలోపు చెల్లించాలి. మరిన్ని వివరాలకు www.nta.ac.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు. ఏవైనా సందేహాలుంటే 011-40759000 నెంబరు, aissee@nta.ac.in అనే ఈ-మెయిల్ చిరునామాలో సంప్రదించవచ్చని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

చైల్డ్ హెల్ప్ సెంటర్‌లో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలో చైల్డ్ హెల్ప్ సెంటర్, రైల్వే కియోస్క్ పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... చైల్డ్ వెల్ఫేర్, స్పెషల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఏర్పాటుచేసిన డిస్ట్రిక్ట్ చైల్డ్ హెల్ప్ సెంటర్, రైల్వే కియోస్క్ పోస్టులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ (1 పోస్టు), సూపర్ వైజర్ (8 పోస్టులు), మీడియేటర్ (1 పోస్టు), కేస్ ఆఫీసర్ (10 పోస్టులు) భర్తీ చేయనున్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వేర్వేరు దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తులు, ఇతర వివరాలకు https://chennai.nic.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు. అలాగే తగిన సర్టిఫికెట్లతో దరఖాస్తులను 'జిల్లా బాలల రక్షణ అధికారి, జిల్లా బాలల రక్షణ యూనిట్, చెన్నై-సౌత్, నెం.1 కొత్తవీధి, కార్పొరేషన్ కమర్షియల్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, అలందూర్, చెన్నై-600016' అనే చిరునామాలో అందించవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఈ ఏడాది మూడు ప్రత్యేక 'టెట్'లు

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సర్వీసులో కొనసాగేందుకు అర్హత ఉన్న ఉపాధ్యాయుల కోసం 2026లో మూడు ప్రత్యేక టెట్‌లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రత్యేక టెట్‌ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఉపాధ్యాయ ఎంపిక బోర్డుకు పాఠశాల విద్యాశాఖ అనుమతులిచ్చింది. 2026 జనవరి, జూలై, డిసెంబరులో ఈ ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2026లో నిర్వహించే టెట్ ఫలితాల తర్వాత, 2027లో అవసరమైన విధంగా టెట్ నిర్వహించేందుకు కూడా ప్రభుత్వం అనుమతులు జారీచేసింది.

విగ్రహాన్ని విక్రయించేందుకు ప్రయత్నం

● ఇద్దరి అరెస్టు

అడయార్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా ఉసిలంపట్టిలోని ఓ ఆలయంలో మాణిక్యవాసగర్ విగ్రహాన్ని చోరీ చేసి విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఉసిలంపట్టికి చెందిన కాశిమాయన్ (42), తవసి అని గుర్తించారు. అలాగే, వీరి చోరీ చేసిన విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కాశిమాయన్ ముఠాకు చెందిన సోలై, వేల్ మురుగన్, మదన్ అనే వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

దిండుగల్ జిల్లాలో యువకుడి పరువుహత్య


మృతుడు రామచంద్రన్ (పాతచిత్రం)

ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నిలకోట సమీపంలోవున్న రామనాయకన్‌పట్టిలో కులాంతర వివాహం చేసుకున్న రామచంద్రన్ (24) అనే యువకుడు దారుణహత్యకు గురైన నేపథ్యంలో, పోలీసులు పరువుహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రామచంద్రన్ పాడిపశువులు పెంచుతూ ఇంటింటికీ పాలు సరఫరా చేస్తూ, తమ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాడు. ఈ నేపథ్యంలో గణపతిపట్టికి చెందిన చంద్రన్ కుమార్తె ఆర్తి (21)తో రామచంద్రన్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. కరూర్‌లో ని ఓ కళాశాలలో చదువుతున్న ఆర్తి, రామచంద్రన్ వేర్వేరు కులాల వారు కావడంతో వారి ప్రేమను యువతి తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో ఆందోళనకు గురైన ప్రేమజంట మూడు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి స్నేహితుల సహకారంతో వివాహం చేసుకున్నారు. అనంతరం రామనాయకన్‌పట్టిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అయితే వధూవరుల కుటుంబాల మధ్య ఏర్పడిన విభేదాలు చివరకు ఘర్షణకు దారితీశాయి. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం ఇంటినుంచి బైక్‌లో బయలుదేరిన రామచంద్రన్ అయ్యంపాళయం ప్రాంతంలో వంతెన పైకి చేరుకున్న సమయంలో అక్కడ మాటువేసి ఉన్న ఆర్తి తండ్రి చంద్రన్ మరో ఇద్దరితో కలిసి వేటకొడవళ్లతో దాడి చేయడంతో రామచంద్రన్ అక్కడికక్కడే మృతిచెందాడు. దుర్ఘటనపై స్థానికులు అందజేసిన సమాచారంతో నిలకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రామచంద్రన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం ఆర్తి తండ్రి చంద్రన్‌ను అరెస్ట్ చేసి పరారైన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

అడవి ఏనుగు దాడిలో ఇద్దరి మృతి


హేమాశ్రీ, అచ్చులా (ఫైల్‌ఫొటో)

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై సమీపం వాటర్‌ఫాల్స్ ఎస్టేట్ ప్రాంతం వద్ద సోమవారం వేకువజామున అడవి ఏనుగుల గుంపు కార్మికుల నివాసప్రాంతాల్లో చొరబడ్డాయి. ఓ ఇంటిలో నిద్రపోతున్న అచ్చులా (55) అనే మహిళ, పక్కనే పడుకున్న ఆమె మనవరాలు హేమాశ్రీ పై ఓ ఏనుగు దాడి జరిపింది. ఈ సంఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఈ సమాచారం తెలియగానే అటవీ శాఖ ఉన్నతాధికారులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. తరచూ రాత్రిపూట ఇళ్లపై అడవి ఏనుగులు దాడికి దిగుతున్నాయని, వాటి బారి నుంచి తమను కాపాడాలని ఎస్టేట్ కార్మికులు అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

కిడ్నీ విక్రయం కేసులో ఇద్దరు బ్రోకర్ల అరెస్టు

అడయార్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా పాల్లిపాళయంలో వెలుగు చూసిన కిడ్నీ విక్రయ కేసులో ఇద్దరు బ్రోకర్లను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలోని సత్యానగర్‌కు చెందిన కౌసల్య అనే మహిళ కిడ్నీ విక్రయించినట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆమెను విచారించగా తిరుచ్చిలోని ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి కిడ్నీ తీశారని, ఇందుకోసం ఆస్పత్రి యాజమాన్యం కూడా 6 లక్షలు చెల్లించినట్టు వెల్లడించారు. దీంతో ఈ కేసులో మరింత లోతుగా విచారణ జరిపారు. ఈ విచారణలో కిడ్నీ బ్రోకర్లుగా చెలామణి అవుతున్న స్టాలిన్ మోహన్ (48), ఆనందన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరివద్ద విచారణ జరుపుతున్నారు.

పోలీసు వాహనాన్ని ఢీకొన్న కారు


● ఎస్‌ఐ సహా ఐదుగురికి గాయాలు

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా రాశిపురంలో పోలీసు వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో మహిళా ఎస్‌ఐ సహా ఐదుగురికి గాయాలయ్యాయి. రాశిపురం మహిళా ఎస్‌ఐ కోమలవల్లి పర్యవేక్షణలో నలుగురు పోలీసులు సోమవారం తెల్లవారుజామున వాహనంలో గస్తీకి వెళ్లారు. ఆ సమయంలో వస్తున్న ఓ కారు స్పీడ్ బ్రేకర్‌ను డ్రైవర్ గమనించకపోవడంతో కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న పోలీసు వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఎస్‌ఐ సహా ఐదుగురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు, వాహన చోదకులు గాయపడినవారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మాజీ మంత్రిపై పోలీసులకు ఫిర్యాదు

ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఇన్బ తమిళన్ రూ.7కోట్ల మేర మోసం చేశారని మదురైలోని ఓ ప్రైవేటు బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు నియోజకవర్గంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తామరైకని అన్నాడీఎంకే నుంచి వైదొలిగారు. ఈ నేపథ్యంలో, 2001 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత తామరైకనిని ఓడించే రీతిలో ఆయన కుమారుడు ఇన్బతమిళన్‌ను అన్నాడీఎంకే అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన ఇన్బతమిళన్ పార్టీలో పలు పదవుల్లో కొనసాగారు. అంతేకాకుండా 2001 నుండి 2006 వరకు యువజన సంక్షేమ, క్రీడాశాఖ మంత్రిగా పనిచేశారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి జయలలిత మంత్రివర్గంలో రెండోసారి మంత్రి అయ్యారు. జయ మరణానంతరం ఆయన అన్నాడీఎంకే పార్టీ నుంచి వైదొలిగారు. ఈ నేపథ్యంలో, ఇన్బ తమిళన్ తన మిత్రుడి కోసం బ్యాంకులో రూ.7కోట్లు రుణం ఇప్పించి తిరిగి చెల్లించకుండా మోసం చేశారని శ్రీవిల్లిపుత్తూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రైవేటు బ్యాంకు మేనేజర్ సోమవారం ఫిర్యాదు చేశారు.

పుష్పవనం జాలర్లపై సముద్రపు దొంగల దాడి


దాడిలో గాయపడిన జాలర్లు

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేదారణ్యం సమీపంలోని పుష్పవనం గ్రామానికి చెందిన 21 మంది జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు దాడిచేశారు. కొడియకరైకి ఆగ్నేయంగా ఉన్న పుష్పవనం నుంచి ఐదు పడవల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లారు. నడి సముద్రంలో వారు చేపలు పడుతున్న సమయంలో, మూడు పడవల్లో వచ్చిన శ్రీలంక సముద్రపు దొంగలు దాడిచేశారు. ఐదు పడవల్లోని 21 మంది జాలర్లపై దాడిచేసిన దొంగలు, వారి చేపలు వలలు, జీపీఎస్ పరికరాలు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. తీరానికి చేరుకున్న జాలర్లు మత్స్యశాఖ, తీర ప్రాంత రక్షణ దళం అధికారులకు ఫిర్యాదు చేశారు.

కబడ్డీ పోటీలో వాగ్వాదం


● కత్తులతో దాడికి పాల్పడిన వైనం


గాయపడిన విద్యార్థి రాఘవేంద్ర

తిరుత్తణి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని అరుంగుళం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న తరుణ్‌కుమార్ తన మిత్రులతో కలిసి సోమవారం పాఠశాల ప్రాంగణంలో కబడ్డీ ఆడేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో, ఆటమధ్యలో తరుణ్‌కుమార్ స్నేహితుడు రాఘవేంద్ర మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పరస్పరం దాడికి పాల్పడ్డారు. ఇంతలో తరుణ్‌కుమార్ తనదగ్గరున్న చిన్న కత్తితో రాఘవేంద్రపై దాడి చేశాడు. రాఘవేంద్రకు తీవ్రంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు రాఘవేంద్రను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

టీవీకేతో అన్ని పార్టీలకూ నష్టమే..!

● ఎమ్మెల్యే ఈశ్వరన్



ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొంగు మండలంలో అన్ని పార్టీల ఓట్లను తమిళగ వెట్రి కళగం (టీవీకే) తప్పకుండా చీలుస్తుందని, ఇందువల్ల కూటమికి నష్టంవాటిల్లకుండా అధికార డీఎంకే చర్యలు తీసుకోవాలని కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి (కేఎండీకే) ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే ఈశ్వరన్ అభిప్రాయం వ్యక్తంచేశారు. ఆయన కోవైలో సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ సమావేశంలో కోవై, ఈరోడ్ తదితర కొంగునాడు జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఈశ్వరన్ మీడియాతో మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంగు మండలంలో ఉన్న 39 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 23స్థానాలను అన్నాడీఎంకే కైవసం చేసుకుందని, ఈ సారి ఆ స్థానాలు కూటమికి దక్కేలా డీఎంకే వ్యూహ రచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. సినీ నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడం వల్ల కొంగు మండలంలో అన్ని పార్టీల ఓటు బ్యాంకు చీలుతుందని, తాను ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న తిరుచెంగోడులో పూర్తిచేసిన అభివృద్ధి పనులే తనను మళ్లీ గెలిపిస్తాయని ఈశ్వరన్ నమ్మకం వ్యక్తం చేశారు.

తాగుబోతు భర్త వేధింపులు తాళలేక

ఇద్దరు కుమార్తెల సహా భార్య ఆత్మహత్య


ముత్తులక్ష్మి (ఫైల్‌ఫొటో)

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి గంగైకొండాన్ సమీపం పరుత్తికుళం వద్ద రోజూ తాగుబోతు భర్త వేధింపులు తట్టుకోలేని ఓ గృహిణి తన ఇద్దరు పిల్లల్ని బావిలోకి తోసి, తనూ ఆత్మహత్య చేసుకుంది. పరుత్తికుళంలో ముత్తయ్య (38), ముత్తులక్ష్మి (27) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి ముత్తుమిళ్ (5), సుశీలాదేవి (3) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. ముత్తయ్య ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ రోజూ పీకలదాకా తాగి ఇంటికి చేరుకుని భార్యతో గొడవపడేవాడు. గత రెండు రోజులుగా ముత్తయ్య మాంసాహారం వండమని భార్యను చితకబాదాడు. దీంతో ముత్తులక్ష్మి కోపంగా తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి పీకల దాకా మద్యం తాగి అత్తగారింటికి వెళ్ళి ముత్తులక్ష్మిని కాపురానికి రమ్మని పిలిచినా, రానని పట్టుదలగా చెప్పడంతో ఆమెను నానా దుర్భాషలాడి వెళ్ళిపోయాడు. సోమవారం ఉదయం ముత్తులక్ష్మి ఆమె పిల్లలు కనిపించడకపోవంతో ఆమె తల్లి అన్ని చోట్లా వెదికారు. చివరకు ఓ బావి వద్ద ముత్తులక్ష్మి, ఆమె కుమార్తెల చెప్పులుండటంతో ఆమె బావిలోకి తొంగి చూసింది. ఆ బావిలో ఇద్దరు బాలికలు శవాలుగా తేలుతుండటాన్ని చూసి దిగ్భ్రాంతి చెంది వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో వెళ్ళి బావిలోంచి బాలికల మృతదేహాలను వెలికి తీశారు. ఆ తర్వాత బావిలో అడుగున పడి ఉన్న ముత్తులక్ష్మి మృతదేహాన్ని కూడా బయటకు తీశారు. పోలీసుల విచారణలో ముత్తులక్ష్మి తాగుబోతు భర్త వేధింపులు భరించలేకే ఇద్దరు పిల్లల్ని బావిలోకి తోసి, తనూ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ముత్తయ్య, అతడి కుటుంబ సభ్యుల వద్ద విచారణ జరుపుతున్నారు.

● లైంగిక వేధింపుల వ్యవహారం..

ఇద్దరు ప్రొఫెసర్ల నిర్బంధ పదవీ విరమణ

పెరంబూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫిర్యాదు మేరకు తిరుచ్చి భారతిదాసన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు నిర్బంధ పదవీ విరమణ ఇస్తూ వర్సిటీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. తిరుచ్చి భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాఖ విభాగాధిపతిగా పనిచేసి, అనంతరం వాణిజ్య విభాగానికి బదిలీ అయిన ప్రొఫెసర్ గణేశన్, రిమోట్‌సెన్సింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రమేష్ కొందరు విద్యార్థినులను లైంగికంగా వేధించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ ఫిర్యాదులను విచారించిన కమిటీ ఇద్దరు ప్రొఫెసర్లపై చర్యలు చేపట్టాలని సెప్టెంబరులో గవర్నింగ్ కౌన్సిల్‌కు నివేదిక అందజేసింది. ఈ సిఫారసులను గవర్నింగ్ కమిటీ ఉన్నత విద్యాశాఖకు పంపింది. వాటిని పరిశీలించిన కళాశాల విద్యా కమిషనర్ సుందరవల్లి, ప్రొఫెసర్లపై చర్యలు చేపట్టారు. ఆ ప్రకారం, ఇద్దరు ప్రొఫెసర్లకు తప్పనిసరి పదవీ విరమణ ఉత్తర్వులతోశనివారం అందజేశారు. ప్రొఫెసర్లలో రమేష్ వచ్చే ఏడాది పదవీవిరమణ చేయనున్నారు.

విద్యార్థుల మధ్య వాగ్వాదం..

- ఒకరికి కత్తిపోట్లు

అడయార్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్ళూరు జిల్లా తిరువలంగాడులో ఇద్దరు విద్యార్థులు గొడవపడి వాగ్వాదానికి దిగారు. ఇందులో ఒక విద్యార్థి మరో విద్యార్థిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి విద్యార్థిని ఉపాధ్యాయులు ఆస్పత్రిలో చేర్పించారు. పాఠశాల క్రీడా మైదానంలో ఆడుకుంటుండగా ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. ఈ దాడిలో గాయపడిన విద్యార్థి రాఘవేంద్రగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బస్సులో గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

తిరుత్తణి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల మీదుగా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు తనిఖీ ముమ్మరం చేశారు. ఆదివారం సాయంత్రం తిరుత్తణి ఉత్తర జోన్ పోలీస్ చీఫ్ అస్రాగార్గ్ నేతృత్వంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న ప్రభుత్వ బస్సులో గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో బస్సులను ఆపి తనిఖీలు జరిపారు. ఈ నేపథ్యంలో ఓ బస్సులో 500 కిలోల గంజాయి, 733 మత్తు బిళ్లలు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని గంజాయి తరలిస్తున్న రూబన్ (26), సూర్య (25), నివాస్ (23), అహ్మద్ (22) అనే నలుగురు యువకులను అరెస్ట్ చేశారు. విచారణలో ఈ గంజాయిని ముంబయిలో కొనుగోలుచేసి రైలులో తిరుపతి వరకు తీసుకొచ్చి అనంతరం బస్సులో చెన్నైకితరలించి కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు నలుగురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

విమానం గాల్లో ఉండగా అద్దానికి పగుళ్లు

● చెన్నైలో సురక్షిత ల్యాండింగ్

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి నుంచి చెన్నై బయల్దేరిన ఇండిగో విమానం గాల్లో ఉండగా విండో షీల్డ్‌లో పగుళ్ల ఏర్పడ్డాయి. సోమవారం మధ్యాహ్నం 2.04 గంటలకు తూత్తుకుడి నుంచి చెన్నైకి ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏటీఆర్ రకం విమానంలో 62 మంది ప్రయాణికులు, ఐదుగురు విమాన సిబ్బంది ప్రయాణించారు. ఈ క్రమంలో, సుమారు 1,500 అడుగుల ఎత్తులో 250 కి.మీ వేగంతో ఎగురుతున్న విమానం ముందు అద్దంలో పగుళ్ల ఏర్పడ్డాయి. పగుళ్లను గుర్తించిన పైలెట్ వెంటనే చెన్నై విమానాశ్రయం కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. విమానం చెన్నైలో అత్యవసర ల్యాండింగ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పరిస్థితులో మధ్యాహ్నం 3.35 గంటలకు ల్యాండింగ్ కావాల్సిన విమానాన్ని, 8 నిమిషాలు ముందుగా మధ్యాహ్నం 3.27 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానాన్ని తనిఖీ చేసిన అధికారులు, విమానం మళ్లీ వెళ్లేందుకు అనర్హమైనదని నిర్ధారించారు. కాగా, విమానం అద్దం పగుళ్లపై డీజీసీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

బాంబు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయల్‌లోని పార్క్, ఆలయానికి బాంబు బెదిరింపు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఆదివారం ఫోన్ చేసిన అపరిచిత వ్యక్తి, దుర్భాషలాడుతూ, మధురవాయల్ పల్లవన్ నగర్ పార్క్, దాని సమీపంలోని ఆలయంలో బాంబులు ఉన్నాయని చెప్పి ఫోన్ కట్ చేశాడు అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌తో ఆ ప్రాంతాలకు చేరుకుని గాలించి, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా విల్లుపురం జిల్లా విక్రవాండి తాలూకాకు చెందిన భూపతి (43)ని అరెస్ట్ చేశారు. నగరంలో కూలీ పనులకు వెళ్తున్న భూపతి, మద్యం మత్తులో ఈ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

మూడో రోజుకు చేరుకున్న రామేశ్వరం జాలర్ల సమ్మె


తీరంలో నిలిచిన పడవలు

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం దాడులకు నిరసనగా రామేశ్వరం జాలర్లు చేపట్టిన సమ్మె సోమవారం మూడో రోజుకు చేరింది. రామేశ్వరం నుంచి ఈ నెల 8వ తేది చేపల వేటకు వెళ్లిన 30 జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. అలాగే, కారైక్కాల్‌కు చెందిన 17 మందిని కూడా శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో, రామేశ్వరం మత్స్యశాఖ టోకెన్ల కార్యాలయం సమీపంలో ఈ నెల 10వ తేది జాలర్ల సంఘాలు సమావేశం నిర్వహించాయి. సమావేశంలో... శ్రీలంక నావికా దళం ధ్వంసం చేసిన పడవలకు ప్రభుత్వం పరిహారం అందించాలి, శ్రీలంక నావికా దళం దాడులను ఖండిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేలా నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించాలి, ఈ అమానుష దాడులు అడ్డుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ 11వ తేది నుంచి జాలర్లు సమ్మె చేపట్టారు. ఈ కారణంగా సుమారు 800లకు పైగా పడవలు తీరానికే పరిమితమయ్యాయి. ఈ సమ్మె మూడవ రోజైన సోమవారం కూడా కొనసాగింది.

టీవీకే కార్యాలయం వద్ద కరూర్ మృతుల నివాళి పోస్టర్


మృతుల ఫొటోలతో ఏర్పాటు చేసిన బ్యానర్

ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో మరణించిన వారి సంస్కరణ దినం సందర్భంగా తమిళగ వెట్రి కళగం (టీవీకే)సోమవారం ఘన నివాళులర్పించింది. కరూర్‌లో గత నెలలో టీవీకే అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41మంది మృతిచెందారు. మృతుల 16వ సంస్కరణ దినాన్ని పురస్కరించుకుని మృతుల ఫొటోలతో నగరంలో టీవీకే కార్యాలయం వద్ద బ్యానర్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా నగరంతటా టీవీకే తరుపున పోస్టర్లు అంటించారు.

మురుగునీటి పంపింగ్ స్టేషన్ మూసివేత

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాక్కం మురుగునీటి పంపింగ్ స్టేషన్ 30 గంటలు మూసివేయనున్నట్లు, మురుగునీటి నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వ్యాసర్పాడి జీవా రైల్వే స్టేషన్ రైల్వే సబ్ వే నిర్మాణంలో భాగగా మురుగునీటి పైప్ లైన్ మార్చాల్సి ఉంది. ఈ కారణంగా పురుషవాక్కం మురుగునీటి పంపింగ్ స్టేషన్ మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం రాత్రి వరకు 30 గంటలు పని చేయదు. నాలుగు మండలాల పరిధిలో లాంగ్స్ గారెన్, నేపియన్ పార్క్, వాల్టాక్స్ రోడ్డు, అయనావరం, ఏకంగిపురం, పెరంబూర్, సెంబియం, చెట్‌పెట్, శాస్త్రి నగర్, కీల్పాక్కం, సుందరం వీధి, షేనాయ్ నగర్, ఓసాన్‌కుళం, గ్రీమ్స్ రోడ్డు ప్రాంతాల్లో మురుగునీరు లీకేజీ అయ్యే అవకాశముంది. అలా జరిగితే, మురుగునీటిని లారీల ద్వారా తొలగించే ఏర్పాట్లు చేపట్టారు. మురుగునీటి లీకేజీపై 8144930905 (రాయపురం), 8144930906 (తిరువిక నగర్), 8144930908 (అన్నా నగర్), 8144930909 (తేనాంపేట) నెంబర్లకు ఫిర్యాదు చేయాలని వాటర్ బోర్డు అధికారులు తెలిపారు.

పళ్లిపట్టు పోస్టాఫీసు మార్పు


ప్రారంభోత్సవంలో తపాలాశాఖ అధికారులు

తిరుత్తణి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సబ్ డివిజనల్ పోస్టాఫీసును అదే ప్రాంతంలోవున్న రాధానగర్‌కు మార్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తపాలాశాఖ అధికారి అరుళ్‌దాస్ పాల్గొని లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజనల్ అధికారి హేమంత్, తపాలాశాఖ అధికారులు మోహన్‌రెడ్డి, మురళీ, సోమనాథప్రకాష్, మునిశేఖర్, వెంకటేష్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

● దీపావళి ఎఫెక్ట్...

రూ.4 కోట్ల మేర గొర్రెల విక్రయం



పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా మేలూరు సంతలో రూ.4 కోట్ల మేర గొర్రెలు విక్రయాలు జరిగాయి. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన ఈ సంతకు రైతులు ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల తదితరాలను విక్రయానికి తెస్తుంటారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు సంతకు వచ్చి వాటిని కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో, ఈ నెల 20న దీపావళి పండుగ సందర్భంగా సోమవారం నిర్వహించిన సంతకు రైతులు భారీ సంఖ్యలో గొర్రెలు తీసుకొచ్చారు. ఒకేరోజు సుమారు రూ.4 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. 10 నుంచి 12 కిలోలు బరువున్న సెమ్మరి గొర్రె రూ.8,000 నుంచి రూ.10వేలు, మేకపోతులు రూ.9వేల నుంచి రూ.12వేల వరకు విక్రయం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పళని తిరు ఆవినంకుడి ఆలయానికి వెండి తలుపులు


ఆలయంలో ఏర్పాటుచేసిన వెండి తలుపులు

పెరంబూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని తిరు ఆవినంకుడి బాల వేలాయుధస్వామి ఆలయం అర్థ మండపానికి వెండి పలకలతో కొత్త తలుపు ఏర్పాటుచేశారు. ఈ మండపంలోని ప్రవేశ ద్వారం తలుపులపై రెండు చెక్కలు, వెండి పలకాలతో చాలా ఏళ్ల క్రితం ఏర్పాటుచేయగా, అవి శిధిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. పనుల్లో భాగంగా, అర్థ మండపం తలుపును వెండి పలకలతో పునరుద్ధరించే పనులు ఈ నెల 9న ప్రారంభమయ్యాయి. పాత తలుపులు తొలగించి, రూ.25 లక్షలతో 12 కిలోల వెండితో తలుపులను నూతనంగా తీర్చి దిద్దారు. ఈ వెండిని కరూర్‌కు చెందిన మురుగపతార్ విరాళంగా అందజేశారు. ఆదివారం పూజల అనంతరం కలశ నీటిని గర్భగుడిలోకి తీసుకెళ్లి, కొత్త వెండి తలుపు తెరిచారు. అనంతరం బాలా వేలాయుధస్వామి, చంద్రమౌళీశ్వరుడు, శారదాంబాళ్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు.

'మ్యాన్ ఆఫ్ తమిళనాడు-2025' విజేతలు వీరే



అడయార్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలో తమిళనాడు మోడల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'మ్యాన్ ఆఫ్ తమిళనాడు 2025' ముగింపు పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో విష్ణు వర్ధన్, కదిర్ వినాయత్, లోకేష్, సూర్య, హరీష్, ఇబ్రహీం తదితరులు విజేతలుగా నిలిచారు. ఈ అంతిమ పోటీల్లో విజేతలుగా నిలిచిన యువకులు ఫిలిప్పీన్స్, మలేసియా, బాలి (ఇండోనేషియా) వంటి దేశాల్లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అనేక మంది సినీ, ఫ్యాషన్ రంగాలకు చెందిన సెలెబ్రిటీలు హాజరయ్యారు. ఈ అంశంపై తమిళనాడు మోడల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడు రాష్ట్రంలోని యువత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభ నిరూపించుకునేందుకు మ్యాన్ ఆఫ్ తమిళనాడు గొప్ప వేదికని, ఇది ప్రపంచ వేదికపై తమిళనాడు గౌరవాన్ని పెంచడానికి ఇది ఒక అవకాశమన్నారు.

దర్శకుడి కష్టానికి 'బైసన్' హిట్ కావాలి : హీరో ధ్రువ్

'బైసన్' చిత్ర నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించిన ఆ చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ కష్టానికి ఈ సినిమా ఘన విజయం సాధించాలని యువ హీరో ధృవ్ ఆకాంక్షించారు. ధృవ్ - అనుపమ పరమేశ్వరన్, రజీషా విజయన్ జంటగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బైసన్'. ఇతర పాత్రల్లో అమీర్, పశుపతి, లాల్ తదితరులు నటించారు. కబడ్డీ నేపథ్యంగా పా.రంజిత్ నీలమ్ స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 17న విడుదల కానున్న నేపథ్యంలో ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ధృవ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం నాతో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఎల్లవేళలా నా తల్లిని సంతోషపెట్టేందుకు కోరుకుంటాను. ఈ సినిమా చూసిన తర్వాత ఆమె ఎంతో సంతోషిస్తారు. 'బైసన్' సినిమా కోసం దర్శకుడు మారి సెల్వరాజ్ ఎంతో కష్టపడ్డారు. ఆయన కష్టానికి తగినట్టుగా ఈ మూవీ హిట్ కావాలని కోరుకుంటున్నాను' అని కోరారు. ఈ మూవీలో కీలక పాత్ర పోషించిన దర్శకుడు అమీర్ మాట్లాడుతూ, 'ఇందులో వేలుసామి అనే పాత్రలో నటించాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పాత్ర క్రెడిట్ దర్శకుడు మారికే చెందుతుంది. ధృవ్ జాతీయ స్థాయిలో కూడా కబడ్డీ ఆడగలడు. ఈ సినిమా కోసం అసిస్టెంట్లు చాలా కష్టపడి పనిచేశారు. వారితోపాటు దర్శకుడు మారి సెల్వరాజ్‌కు నా అభినందనలు' అన్నారు. దర్శకుడు మారి సెల్వరాజ్ మాట్లాడుతూ, 'కొన్ని ప్రాంతాల్లో కబడ్డీ ఆట రక్తంలో కలిసిపోయివుంది. ఈ సినిమా కోసం ఎంపిక చేసిన ఆటగాళ్ళు నిజమైన క్రీడాకారులు. ప్రో కబడ్డీ ప్రభంజన్ చాలాబాగా నటించారు. ఈ సినిమా కోసం ధృవ్ రెండేళ్ళపాటు శ్రమించారు. ఆయనకు ఈ సినిమా మంచి బ్రేక్ వస్తుందని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. ఆ తర్వాత హీరోయిన్లు అనుపమ పరమేశ్వరన్, రజీషా విజయన్, లాల్, పశుపతి తదితరులు ప్రసంగించారు



అనుపమ, ధృవ్, రజీషా విజయన్

హార్ట్ టచింగ్ 'కికి కోకో' యానిమేషన్ మూవీ

ఇనికా ప్రొడక్షన్స్ పతాకంపై హృదయాన్ని హత్తుకునేలా 'కికి కోకో' పేరుతో ఒక యానిమేషన్ చిత్రం రూపొందుతోంది. సాధారణంగా యానిమేషన్ చిత్రాలకు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇలాంటి చిత్రాలను కేవలం చిన్నారులు మాత్రమే కాకుండా పెద్దలు కూడా ఇష్టపడుతుంటారు. తాజాగా వచ్చిన 'మహావతార్ నరసింహ' యానిమేషన్ మూవీ దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్‌హిట్‌గా నిలిచిన విషయం తెల్సిందే. ఇపుడు ఇదే బాణీలో చిన్నారులను ఆకట్టుకునేలా 'కికి కోకో' మూవీని దర్శకుడు పి.నారాయణన్ రూపొందిస్తున్నారు. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'చిన్నారుల వినోదంతోపాటు విద్యపై అవగాహన కల్పించే కథాంశంతో తెరకెక్కిస్తున్నాం. కికిఅనే పెంపుడు కుక్కతో కోకో అనే బాలిక బంధం, ఇతర అంశాలను స్పృశిస్తూ, ప్రేక్షకులు హృదయాలను టచ్ చేసేలా సాగుతుంది' అని పేర్కొన్నారు. 'కికి కోకో' ఒక సినిమా కంటే ఎక్కువ. స్నేహం, ప్రేమ, పిల్లలు కథ చెప్పడం ద్వారా నేర్చుకోగల విలువైన పాఠాల వేడుక. ఈ మాయా ప్రయాణాన్ని హృద్యంగా తెరకెక్కించాం' అని ఇనికా ప్రొడక్షన్స్ బృందం వెల్లడించింది.


'కికి కోకో'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి



నేషనల్ క్రష్‌గా రుక్మిణి వసంత్!

యువ హీరోయిన్ రుక్మిణి వంసత్ నేషనల్ క్రష్‌గా మారిపోయింది.. 'కాంతార చాప్టర్ 1' చిత్రంతో ఆమె నేషనల్ హీరోయిన్ స్థాయికి ఎదిగారు. విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'ఏస్' చిత్రం ద్వారా తమిళ ప్రేక్షకులకు పరిచయమైన రుక్మిణి వసంత్.. ఆ తర్వాత శివకార్తికేయన్ - ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో వచ్చిన 'మదరాసి'లో నటించారు. ఈ రెండు చిత్రాలు ఆమెకు బ్రేక్ ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో 'కాంతార చాప్టర్-1' పాన్ ఇండియా మూవీలో నటించగా, ఈ మూవీ బ్లాక్‌బస్టర్ హిట్ మూవీగా నిలిచింది. దీంతో ఒక్కసారిగా ఆమె నేషనల్ క్రష్‌గా మారిపోయారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'ఇప్పటివరకు సౌత్ ఇండియన్ నటిగా ఉన్న నేను 'కాంతారా చాప్టర్-1'తో నేషనల్ హీరోయిన్‌గా మారిపోయాను. అభిమానుల ప్రశంసలతో సంబరపడిపోతున్నాను. పట్టలేని ఆనందంలో ఉన్నాను. నేను నటిస్తున్న మరో రెండు చిత్రాలు విడుదలైతే నాకు మరింతగా పేరు వస్తుంది. ఇపుడు లభించిన క్రేజ్‌తో పాన్ ఇండియా స్థాయిలో మంచి కథా చిత్రాలను ఎంచుకుని ముందుకు సాగుతాను' అని రుక్మిణి వసంత్ వివరించారు.

వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఎస్‌కే?

విజయంతమైన చిత్రాలతో వరుస చిత్రాల్లో నటిస్తున్న హీరో శివకార్తికేయన్ (ఎస్‌కే)... 'ది గోట్' ఫేం వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటించనున్నారు. ఈ ప్రాజెక్టుపై దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ, 'శివకార్తికేయన్ కథానాయకుడిగా తాను దర్శకత్వం వహించే చిత్రం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. వచ్చే యేడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభమవుతుంది. ఇది వైవిధ్యభరితమైన సైన్స్ ఫిక్షన్ మూవీ. ఇందులో హీరోను సరికొత్త లుక్‌లో చూస్తారు. ఈ ప్రాజెక్టులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, నిర్మాణ సంస్థ, సంగీత దర్శకుడు తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం శివకార్తికేయన్ తన 25వ చిత్రం 'పరాశక్తి'లో నటిస్తున్నారు. ఈ మూవీ సంక్రాంతికి విడుదలకానుంది. ఆ తర్వాత 'డాన్' ఫేం సిబి చక్రవర్తి దర్శకత్వంలో ఎస్‌కే నటిస్తారు. ఆ తర్వాత వెంకట్ ప్రభుతో కలిసి పనిచేయనున్నారు.


శివకార్తికేయన్ - వెంకట్ ప్రభు

సత్యభామ డీమ్డ్ వర్సిటీలో వాతావరణ పరిశోధన కేంద్రం

ప్యారీస్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆకస్మిక మేఘ మథనం, వాతావరణ మార్పులను గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వ తరుపున నగరంలోని సత్యభామ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన 'మిషన్ మౌసమ్' అర్బన్ ఎక్స్‌పెరిమెంట్ సెంటర్‌ను కేంద్ర భౌగోళిక, శాస్త్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్ సోమవారం ప్రారంభించారు. ఓఎంఆర్ రోడ్డు సెమ్మన్‌జేరిలో విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ మరియా జెనా జాన్సన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐఐటీఎం-పూణె డైరెక్టర్ డా.ఎ.సూర్యచంద్రరావు, మిషన్ మౌసమ్ పూణె ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.తారా ప్రభాకరన్, ప్రొఫెసర్ బాలాజీ రామకృష్ణన్, డా.ఆర్ఎస్.గంగార, ఐఎండీ-ఆర్ఎంసీ చెన్నై ఛైర్మెన్ డా.పి.అముదా తదితరులు పాల్గొన్నారు. ఈ వాతావరణ పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం రవిచంద్రన్ మాట్లాడుతూ, మేఘాల్లో మార్పులు, ఎంతెత్తులో ఉన్నాయి తదితర వాటిని అధ్యయనం చేయడానికి మిషన్ మౌసమ్ సెంటర్ సెలోమీటర్, సోడార్, మైక్రోరెయిన్ ర్యాడార్ వంటి హైటెక్ పరికరాలను అమర్చపడిందన్నారు. కేంద్రప్రభుత్వం సహకారంతో సత్యభామ డీమ్డ్ వర్సిటీలో పురాతన వాతావరణ ప్రయోగశాల, సమాచార గ్యాలరీ, జియోక్రోనోస్, ఓసీయానా, ఇనోవారియా విభాగాలను కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ మిషన్ మౌసమ్ కేంద్రం పట్టణ వాతావరణ మార్పులపై శాస్త్రీయ పరిశోధనలను ఏకీకృతం చేయడంతో పాటు కొత్త సామర్థ్య నిర్మాణం, విద్యార్థుల శిక్షణ, అంతర్విభాగాల అవకాశాల సృష్టికి ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా ఇది భారత దేశ వాతావరణ అంచనాలను మెరుగుపరచడంలోనూ, వాతావరణ మార్పుకు దేశం యొక్క స్థితిస్థాపకతను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని ఆయన వివరించారు.


ప్రారంభోత్సవంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎం.రవిచంద్రన్, డాక్టర్ మరియా జెనా జాన్సన్ తదితరులు


టీఎన్‌పీఎస్సీ ద్వారా దేవాదాయ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ (విద్యుత్‌విభాగం), జూనియర్ డ్రాఫ్ట్‌మెన్, అసిస్టెంట్ తదితర పోస్టులకు ఎంపికై నియామక ఉత్తర్వులందుకున్న అభ్యర్థులతో సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్


ఇటీవలే వందో జన్మదినం జరుపుకున్నమాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతన్ కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపు కార్యాలయంలో సీఎం ను మర్యాదపూర్వకంగా కలవగా, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న స్టాలిన్

కారపాక్కంలో 'హై ఆన్ ఫిట్‌నెస్ స్టూడియో'


స్టూడియో ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కారపాక్కం, రాజీవ్‌గాంధీసాలైలో 'హై ఆన్ ఫిట్‌నెస్ స్టూడియో' ఏర్పాటైంది. ప్రముఖ సినీ నటుడు ఆరి అర్జునన్, ఎమ్మెల్యే అరవింద్ రమేష్, ఐఎఫ్ఎఫ్‌బీ ప్రొ డెల్టా దిలీప్, హై ఆన్ ఫిట్‌నెస్ స్టూడియో వ్యవస్థాపకుడు దీనదయాళన్ తదితరులు దీనిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ.. 6వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాల పరికరాలు, సర్టిఫైడ్ ట్రైనర్లతో ఈ స్టూడియో ప్రత్యేకంగా రూపొందించామన్నారు. 180 డిగ్రీల ఎలివేటెడ్ కార్డియో విభాగం, ప్రత్యేకమైన స్పిన్నింగ్, క్రాస్‌ఫిట్ స్టూడియో వ్యక్తిగతీకరించిన పరివర్తన కార్యక్రమాలు కూడా వుంటాయన్నారు. హార్డ్‌కోర్ లిఫ్టింగ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, యోగా, పోరాట శిక్షణ తదితర వసుతలన్నీ తమ వద్ద వున్నాయన్నారు.

'మారిటైమ్ వీక్' మారథాన్‌కు విశేష స్పందన

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'చెన్నై పోర్ట్ అథారిటీ' ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వాక్‌థాన్‌కు విశేష స్పందన లభించింది. పోర్ట్ అథారిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం నుంచి యుద్ధ స్మారక చిహ్నం వరకు సాగిన ఈ వాక్‌థాన్ విజయవంతంగా ముగిసింది. చెన్నై పోర్ట్ అథారిటీ ఛైర్‌పర్సన్, కామరాజర్ పోర్ట్ ఛైర్మన్ సునీల్ పలివాల్, డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్, కామరాజర్ పోర్ట్ ఎండీ ఎస్.మురళీకృష్ణన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం భారత సముద్ర నైపుణ్యాన్ని పెంపొందించడంలో ఆరోగ్యకరమైన శ్రామిక శక్తి నిర్వహించడంలో కీలకమైన పాత్ర హైలైట్ చేస్తూ, ఇండియా మారిటైమ్ వీక్ 2025 నిర్వహించారు. ఈ వాక్‌థాన్‌కు 22 ఏళ్ల స్పీడ్ స్కేటింగ్ ప్రాడి జీ.వి.ఆనంద్ కూడా హాజరవడం విశేషం. ఈ సందర్భంగా సునీల్ పలివాల్ మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరుగనున్న ఇండియా మారిటైమ్ వీక్ ను హైలైట్ చేశారు. ప్రపంచ నేతలు, ఆవిష్కర్తలు, విధాన రూపకర్తలను ఒకచోట చేర్చి సముద్ర రంగంలో స్థిరమైన వృద్ధి, వాణిజ్య అవకాశాలు, సాంకేతిక పురోగతులను అన్వేషించడానికి వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.


వాక్‌థాన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

సైబర్ సెక్యూరిటీలో డిగ్రీ • డీకిన్ వర్సిటీతో వీఐటీ కీలక ఒప్పందం


ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఇరుసంస్థల ప్రతినిధులు

అడయార్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీలో కొత్తగా డ్యూయల్ డిగ్రీని ప్రారంభించడానికి వీఐటీ-చెన్నై డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆస్ట్రేలియాలోని డీకిన్ విశ్వవిద్యాలయంతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై వీఐటీ వైస్ చాన్సెలర్ డాక్టర్ జీవీ సెల్వం, డీకిన్ వర్సిటీ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ భాస్కరన్ సంతకాలు చేశారు. ఈ మేరకు ఈ కోర్సులో చేరే విద్యార్థులు డ్యూయల్ డిగ్రీలు పొందగలుగుతారు. వీటిలో వీఐటీ చెన్నై నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) డిగ్రీ, డీకిన్ వర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ డిగ్రీ ఏకకాలంలో పొందే అవకాశం ఉంది. విద్యార్థులు మొదట వీఐటీ చెన్నైలో తమ అధ్యయనం ప్రారంభించి కంప్యూటర్ సైన్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, డేటా సెక్యూరిటీ వంటి ప్రాథమిక నైపుణ్యాలను నేర్చుకుంటారు. ఆ తర్వాత డీకిన్ వర్సిటీలో అధునాతన కోర్సు, అధ్యయనాలు డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ నిర్వహణ వంటి రంగాల్లో ప్రత్యేక శిక్షణ పొందుతారు. అలాగే, ఈ ఒప్పందం ద్వారా ఇంజనీరింగ్, ఐటీ, ఆర్కిటెక్చర్, నిర్మాణ నిర్వహణ రంగాల్లో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్ కూడా అందిస్తారు. ఈ సందర్భంగా వీఐటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ, తమ వర్సిటీ డీకిన్ వర్సిటీతో ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్పిడితో సహా అనేక రంగాల్లో ఇప్పటికే సహకరిస్తుందన్నారు. ఇపుడు కొత్తగా సైబర్ సెక్యూరిటీ రంగంలో కొత్త డిగ్రీ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టడం ప్రధాన మైలురాయని, విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీలు పొందే గొప్ప అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

'ది బ్రహ్మాస్త్ర అన్‌లిష్డ్' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో ప్రముఖులు


చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ముంబై పోలీసు కమిషనర్‌గా, మహారాష్ట్ర డీజీపీగా పనిచేసిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డి.శివానందన్ తన అనుభవాలు, యదార్థ ఘటనల ఆధారంగా రచించిన 'ది బ్రహ్మాస్త్ర అన్‌లిష్డ్' పుస్తకాన్ని రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు ఆర్‌కే రాఘవన్, యశోవర్ధన్ ఆజాద్, ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌రాజన్ తదితరులు ఆదివారం చెన్నైలో ఆవిష్కరించారు. చెన్నై ఇంటర్నేషనల్ సెంటర్ సహకారంతో సుందరం నటరాజన్ బ్లైండ్ ఫ్రీ ఇండియా ఫౌండేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.నటరాజన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1980-90లలో ముంబైలో జరిగిన సంఘటనల ఆధారంగా రూపొందించబడిన ఈ పుస్తకంలో, అప్పట్లో ముంబై హత్యలు, దోపిడీ, ముఠా యుద్ధాలు, కిడ్నాప్ వంటి నేరాలతో నిండిపోయింది. అండర్‌వరల్డ్ డాన్ల ప్రభావం విపరీతంగా వున్న రోజులవి. ఆ సమయాల్లో అప్పటి పోలీసు కమిషనర్‌గా వున్న డి.శివానందన్ శాంతిభద్రతల పునరుద్ధరించడంలో ఎలాంటి పాత్ర పోషించారన్నది ఈ పుస్తకంలో పేర్కొన్నారు. 1976 బ్యాచ్‌కు చెందిన శివానందన్.. థానే, నాగపూర్‌లలో పోలీసు కమిషనర్‌గా, అలాగే యాంటీ నక్సల్ ఆపరేషన్స్ స్పెషల్ ఐజీగా కూడా వ్యవహరించారు.

కుమరి గుహనాథీశ్వరాలయంలో అష్టోత్తర సహస్ర దక్షిణావర్త శంఖాభిషేకం


అభిషేకానికి సిద్ధం చేసిన దక్షిణావర్త శంఖాలు

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలోని సుప్రసిద్ధ గుహనాథీశ్వరాలయంలో సోమవారం ఉదయం అష్టోత్తర సహస్ర (1008) దక్షిణావర్త శంఖాలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కన్నియాకుమారి రైల్వేస్టేషన్ కూడలికి చేరువగా ఉన్న ఈ ఆలయం అత్యంత ప్రాచీనమైనదని, తంజావూరు బృహదీశ్వరాలయం నిర్మించకముందూ రాజరాజచోళుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఈ ఆలయంలో గుహన్ అనే పేరుతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పరమేశ్వరుడిని ఆరాధించడం వల్ల ఈ ఆలయానికి గుహనాథీశ్వరాలయం అనే పేరొచ్చింది. కన్నియాకుమారి జిల్లాలోనే అత్యంత ఎత్తుకలిగిన ఐదున్నర అడుగుల ఎత్తు శివలింగం ఈ ఆలయంలో ఉంది.. ఇంతటి కీర్తిని సంతరించుకున్న గుహనాథీశ్వరాలయంలో పురటాసి మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్ర పర్వదినాన అష్టోత్తర సహస్ర దక్షిణావర్త శంఖాలతో అభిషేకం నిర్వహిస్తుంటారు.. ఆ మేరకు సోమవారం ఉదయం 1008 దక్షిణావర్త శంఖాలలో నింపిన పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలను వీక్షించడానికి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

ఒకే గొడుగు కిందకు జాజ్ స్టోర్స్


మీడియా సమావేశంలో ప్రతినిధులు

అడయార్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాజ్ గ్రూపునకు చెందిన డేట్స్ అండ్ నట్స్ స్టోర్, జాజ్ ఫ్యాషన్ జ్యూవెలరీని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. ఈ షాపును నగర శివారు ప్రాంతమైన పాత మహాబలిపురం రోడ్డు (ఓఎంఆర్), తొరైప్పాక్కంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తమిళ సినీ ప్రముఖులు రేఖ హారిస్, జనని అయ్యర్, బుల్లితెర నటి కృతికా లడ్డు, ఆర్తి గణేష్, కృతికా అన్నామలై హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజ్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఏపీ ఖాదర్, జాప్ గ్రూపు సీవోవో జఫరుల్లా ఖాన్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ, జాజ్ డేట్స్ అండ్ నట్స్, జాజ్ ఫ్యాషన్ జ్యూవెలరీలో ఆరోగ్యం, అందం వేర్వేరుగా ఉండరాదని విశ్వసించి వీటన్నింటినీ ఒకే గొడుకు కిందకు తెచ్చినట్టు తెలిపారు. మా గ్రూపు నుంచి అందుబాటులో ఉండే డేట్స్ అండ్ నట్స్ నాణ్యతకు మారుపేరుగా ఉంటుందన్నారు.

■ శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు



లక్ష్మీప్రణతి, నార్ని నితిన్ దంపతులు- ఏక్తా కపూర్ - వెంకీ కుడుముల

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హీరోయిన్ కృతిశెట్టి, దర్శకుడు వెంకీ కుడుముల, జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీప్రణతి, ఆమె సోదరుడు, హీరో నార్నె నితిన్ దంపతులు, బాలీవుడ్ సినీనిర్మాత ఏక్తాకపూర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

■ కొత్త టీచర్లొచ్చారు

నూతన ఉపాధ్యాయుల రాకతో జిల్లాలోని పాఠశాలలు సోమవారం కళకళలాడాయి. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఎంపికైన వారిలో 1,394 మంది ఉపాధ్యాయులు పోస్టింగ్ పొందారు. వీరంతా కౌన్సెలింగ్ ద్వారా తమకు కేటాయించిన పాఠశాలల్లో సోమవారం విధులకు హాజరయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. మొదటిరోజు కావడంతో సీనియర్లు నూతన ఉపాధ్యాయులను పరిచయం చేసుకుని విధుల గురించి సూచనలు చేశారు.



తిరుపతిలోని ఎంజీఎం పాఠశాలలో చేరేందుకు..

పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను విశదీకరించారు.

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

ఆదివారం శ్రీవారిని

దర్శించుకున్న భక్తులు: 84,424

తలనీలాలు సమర్పించినవారు: 36,711



మా మొర ఆలకించండి మహాప్రభో..!

పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 'మా మొర ఆలకించి సమస్యలు పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్ వేదికగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 290 వినతులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు 162 వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు. వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ సుధారాణి పాల్గొన్నారు.



మా భూమిని కబ్జా చేశారు..

నేను గూడూరులో చెప్పులు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. తడ మండలం తడ కండ్రిగ గ్రామంలో ప్రభుత్వం 31 సెంట్ల మెట్టభూమి ఇచ్చింది. దీన్ని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. సర్వేకు పలు దఫాలు చలానా కట్టినా హద్దులు కూడా చూపించడంలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయాను. మీరైనా న్యాయం చేయండి.

- చంద్రయ్య, తడకండ్రిగ, తడ మండలం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు



మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిలా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ 138జీవో ప్రకారం పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పోను రూ.16వేలు, సూపర్‌వైజర్లకు రూ.18,600 వేతనం ఇవ్వాల్సి ఉండగా అరకొరగా ఇస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. వారికి డీఎంహెచ్‌వో సంతకంతో కూడిన గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్డీ రవి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఉదయ్‌కుమార్, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు నరసింహులు, కిషోర్, వరలక్ష్మి, పద్మ, నాగభూషణం, సుశీల, సులోచన, వనజ, సునీల్, పార్వతి పాల్గొన్నారు.

మా పొలాన్ని ఆక్రమించారు.. న్యాయం చేయండి



తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురం గ్రామ పరిధిలో 40ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. రెవెన్యూ అధికారులు మా పాసుపుస్తకాన్ని మరొకరికి ఇచ్చారు. దీనిపై పలుమార్లు అడిగినా సమాధానం చెప్పలేదు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మా భూమిలోకి ప్రవేశించి హద్దులు చెరిపేశారు. మేము పొలం వద్దకు వెళితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. కోర్టుకు కూడా వెళ్లాం. కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశాం. లాభం లేకపోయింది. స్థానిక రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారు. కబ్జాదారులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి. లేకపోతే చావు ఒక్కటే మాకు మార్గం.

- వీరాస్వామి, అమరావతి దంపతులు, శ్రీకృష్ణాపురం, తొట్టంబేడు మండలం

పెండింగ్ వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయండి

శెట్టిపల్లెలో పెండింగ్‌లో ఉన్న 30 ఎకరాల వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2018లో అప్పటి కలెక్టర్ చెప్పిన విధంగా శెట్టిపల్లె గ్రామం ఉత్తరం వైపు, చెరువుకు తూర్పు వైపున సప్లై చానల్‌కు దక్షిణం వైపున ప్లాట్స్ అలాట్‌మెంట్ చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా అలాట్‌మెంట్ చేసే ప్లాట్లను మినిమం సైజు ద్వారా ఇవ్వాలన్నారు. శెట్టిపల్లె గ్రామంలో తుడా మాస్టర్‌ప్లాన్ రోడ్డును కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బత్తినిబాబు, జయరామయ్య, చెంగయ్య పాల్గొన్నారు.



సీజేపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దేవదాసు, వాసుదేవ రావు, మధు, గోపి, అరుణ, రవి డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు.



దివ్యాంగుల పింఛను ఇప్పించండి

మేము ముగ్గురం ఆడ పిల్లలం. తండ్రి మరణించాడు. 90శాతం వికలాంగత్వం ఉంది. ఏ పనీ చేయలేను. దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోండి.

- సత్యవతి, ఎల్లమండ్యం, రేణిగుంట మండలం

ఒక్క నిర్ణయం.. ఎందరికో జీవితం

● నూతన ఉపాధ్యాయుల్లో వెల్లివిరిసిన ఆనందం

తిరుపతి(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఈడీ చేశారు. డీఎస్సీ కోసం ఆరేళ్లకుపైగా ఎదురు చూశారు. కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహించాలన్న నిర్ణయం.. ఉమ్మడి జిల్లాలోని 1403 మంది జీవితాల్లో వెలుగు నింపింది. వీరిలో 1394 మంది పోస్టింగ్ ఆర్డర్లు పొందారు. సోమవారం బడుల్లో చేరారు. ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

నా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం



మాది పేద దళిత కుటుంబం. ముగ్గురు ఆడపిల్లలో రెండో అమ్మాయిని. నా తల్లిదండ్రులు పద్దమ్మ, గున్నయ్య కూలి పనులుచేస్తూ చదివించారు. పేదరికం నుంచి బయటపడేందుకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మెగా అవకాశాన్ని వదులుకోకూడదని కష్టపడ్డా. డీఎస్సీలో 76.57 మార్కులు సాధించి సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. చిత్తూరు జిల్లా వి.కోట మండలం కుదువగడ్డ ప్రాథమిక పాఠశాలలో చేరా. ప్రభుత్వం కల్పించిన అవకాశం.. మా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం ఈ ఉద్యోగం.

- టి.భవాని, కమ్మకొత్తూరు, శ్రీకాళహస్తి మండలం

తల్లిదండ్రులకే అంకితం



మా తల్లిదండ్రులు జానకమ్మ, రాధాకృష్ణ వ్యవసాయంతో జీవనం సాగించేవారు. నన్ను ఎంతో ప్రోత్సహించారు. మెగా డీఎస్సీలో అర్హత పొందిన నేను ఎస్జీటీలో జిల్లాలో 24వ ర్యాంకు, ఎస్ఏ సోషల్ 67వ ర్యాంకు, టీజీటీ సోషల్ 77వ ర్యాంకు, టీజీటీ తెలుగులో 31వ ర్యాంకు సాధించా. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా చేరా. ఎన్ని ఇబ్బందులున్నా నాకు ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఈ ఉద్యోగాన్ని అంకితం చేస్తున్నా.

- నల్లపాటి శివకుమార్, గోవిందప్పనాయుడు కండ్రిగ, బీఎన్‌కండ్రిగ మండలం

అత్యంత ఆనందం



మాది పేద దళిత కుటుంబం. బీకామ్, బీఈడీ చేశా. నా తల్లిదండ్రులు బొగ్గల ఆదెయ్య, వేమక్కకు పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉన్నా. మెగా డీఎస్సీ ప్రకటనతో కోచింగ్ లేకుండానే కష్టపడి సన్నద్ధమయ్యా. రాయలసీమ జోన్ పరిధిలో 67.1028 మార్కులతో టీజీటీ సోషల్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. రేణిగుంట మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విధుల్లో చేరా. అన్ని వృత్తుల్లోకి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి లభించడం నా ఆనందం.

- ప్రతాప్, ఎన్టీఆర్ నగర్, బుచ్చినాయుడు కండ్రిగ మండలం

మెగా డీఎస్సీ జీవితాన్నిచ్చింది



మాది నిరుపేద దళిత కుటుంబం. మెగా డీఎస్సీలో 75.46 మార్కులతో సాధించి సెకండరీగ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యా. శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. చిన్న వయసులోనే తండ్రి వీరయ్యను కోల్పోయా. కష్టపడి నన్ను చదివించిన తల్లి మెరుంవాణి కూడా ఏడాది కిందట చనిపోయింది. మెగా డీఎస్సీ నాకు జీవితాన్నిచ్చింది.

- లావణ్య, చిన్నసింగమాల, తొట్టంబేడు మండలం

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మాన్న ఫిజికల్ డైరెక్టర్ మస్తానయ్య. తల్లి కళావతి. గత డీఎస్సీలో ఉద్యోగం సాధించలేకపోయాను. మెగా డీఎస్సీ ప్రకటించగానే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివా. మెగా డీఎస్సీలో 83.03 మార్కులు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం సాధించా. బుచ్చినాయుడు కండ్రిగ మండలం తలారివెట్టు ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. మా నాన్నను ప్రేరణగా తీసుకుని ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి నా ఆనందానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- పవన్‌కుమార్, కాంపాళెం, బీఎన్ కండ్రిగ మండలం

అంతరిక్ష ప్రయోగాలతో మానవాళి శ్రేయస్సు

● షార్ డైరెక్టర్ పద్మకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడతాయని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. సోమవారం సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 63 ఏళ్లలో ఇస్రో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఇతరదేశాలకు సైతం ఉపగ్రహ సాంకేతికతను అందించే స్థాయికి ఎదిగిందన్నారు. వాతావరణం, ఆహార భద్రత, దేశరక్షణ, మత్స్య సంపద ఉనికి, అడవుల పరిరక్షణ, టెలీ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ విభాగాల్లో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రోఆధ్వర్యంలో 'యువికా'లాంటి కార్యక్రమాలతో పాటు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టుల ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతరిక్ష వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ ప్రిన్సిపాల్, కమాండెంట్ రాజేష్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెలియన్, కంట్రోలర్ జి.రమేష్ బాబు, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, వాల్ఫ్ డీడీ శంకరన్, రమణారెడ్డి, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న టిప్పర్

● మాజీ సర్పంచ్ సురేంద్రనాయుడి మృతి



రామచంద్రాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రామాపురం సమీపంలో సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాజీ సర్పంచి సురేంద్ర నాయుడు(60) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రామచంద్రాపురం మండలం కొత్తకండ్రిగకు చెందిన లెక్కల సురేంద్ర నాయుడు తన పొలంలో కూరగాయలను తిరుపతి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. సోమవారం ఉదయం 5గంటలకు తిరుపతిలో విక్రయించి ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో రామాపురం సమీపంలోని విల్లాస్ వద్ద వస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందారు. ఎస్ఐ భక్తవత్సలం, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర సాధనతో లక్ష్యాల ఛేదన

● 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవంలో కలెక్టర్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రామిశెట్టి మౌనిక, జి.కీర్తి, వేలూరు చేతనకు కలెక్టర్‌తో పాటు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి కలిసి కళాచిత్ర ట్రస్టు అందించే పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పేదరికాన్ని జయించడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కళాచిత్ర కుటుంబ సభ్యులు తాము చదివిన పాఠశాలలో విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. వచ్చే ఏడాది నుంచి కళాచిత్రతో పాటు శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనూ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామన్నారు.

మూడో కన్ను పుస్తకావిష్కరణ: రచయిత, ఆంధ్రజ్యోతి పూర్వ విలేకరి ఆర్ఎంవీ భాస్కర్‌బాబు రచించిన మూడో కన్ను పుస్తకాన్ని కలెక్టర్, శ్రీసిటీ ఎండీ ఆవిష్కరించారు. ఆరుపదుల వయస్సులో ఇలాంటి మంచి పుస్తకాన్ని రచించారంటూ రచయితను అభినందించారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో సునీల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కళాచిత్ర పురస్కారం అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్



గిరీష్మసైనిరెడ్డి



విష్ణుప్రియ



పర్ణితయాదవ్



కె.శుభశ్రీ



రుక్సార్‌తబ్సుమ్

ఆంధ్రా ఉమెన్ టి20 క్రికెట్ జట్టుకు జిల్లా నుంచి ఐదుగురు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్ 19 ఉమెన్స్ టీ20క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు మహిళా క్రీడాకారులకు స్థానం లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవలె నిర్వహించిన ఎంపిక పోటీలలో తిరుపతికి చెందిన ఎం.గిరీష్మసైనిరెడ్డి(వైస్‌కెప్టెన్), కె.శుభశ్రీ, ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణితయాదవ్, వాయల్పాడుకు చెందిన ఎం.రుక్సార్‌తబ్సుమ్ సత్తాచాటారు. దీంతో వీరి ఎంపికపై సెలెక్టర్లు మొగ్గుచూపారు. ఈ ఐదుగురిలో ఒకరికి వైస్‌కెప్టెన్ బాధ్యతలు అప్పగించడం విశేషం. ఈ నెల 20నుంచి 23వరకు తెలంగాణలోని ఔరంగాబాదు జరగనున్న అండర్ 19ఉమెన్స్ టీ20చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

పళ్లికొండేశ్వర ఆలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి విచారణ

నాగలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వరాలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి సోమవారం మధ్యాహ్నం నూతన పాలక మండలికి సంబంధించి విచారణ చేపట్టారు. గత శుక్రవారం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగిన విషయం తెలిసిందే. ఈ పాలక మండలి ఏర్పాటైన రెండు రోజుల్లోనే ఇద్దరు ప్రధాన సభ్యుల నేర చరిత్రపై, ఆలయ ఈవో లతపై దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఫణిరాజ శయన సోమవారం పళ్లికొండేశ్వర ఆలయ కార్యాలంలో పాలకమండలి సభ్యుల నేర చరిత్రపై ఆలయ ఈవోతో చర్చించినట్లు తెలిసింది. అలాగే వీరి నేర చరిత్రకి సంబంధించిన సమగ్ర వివరాలను దేవాదాయశాఖ అధికారులకు ఎందుకు సమర్పించలేదని ఈవోను ప్రశ్నించినట్లు తెలిసింది. వీరి నేర చరిత్రలకు సంబంధించిన జిరాక్స్ కాపీలను తమతో తీసుకెళ్లినట్లు సమాచారం.

నకిలీ మద్యంపై అసత్య ప్రచారం

పోలీసుల అదుపులో ఇద్దరు వైసీపీ నాయకులు



నవీన్

తిరుపతి(నేర విభాగం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం పేరిట ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంచేసి, ప్రజలను తప్పుదారి పట్టించారంటూ ఇద్దరు వైసీపీ నేతలను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తిరుపతి వైసీపీ ఉత్తర విభాగం అధ్యక్షుడు, భూమన అభినయ్ అనుచరుడు నవీన్, అతడి అనుచరుడు వెంకటేష్‌ను అలిపిరి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అభినయ్, వైసీపీ శ్రేణులు అలిపిరి స్టేషన్‌కు వచ్చారు. ఏ కారణంతో.. ఏ కేసు కింద వారిని అదుపులోకి తీసుకున్నారని పోలీసులను భూమన ప్రశ్నించారు. దీంతో కాసేపు అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. డీఎస్పీ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.